## విద్యార్థినిలకు మహిళా పోలీసులు ఓపెన్ హౌస్



చిత్తూరురూరల్, మార్చి 6 ప్రభాతవార్త:
అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా సాధికారిత వారోత్సవాల్లో భాగంగా చిత్తూరు మహిళా పోలీసులు గురువారం చిత్తూరులోని కళాశాలల విద్యార్థినిలకు చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఎస్.విజయశేఖర్ ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్‌లో విద్యార్థినిలకు పోలీసు ఆయుధాలను ప్రదర్శించి వాటి వినియోగంను వివరించారు. అలాగే విద్యార్థినిలకు మహిళా ఎస్ఐలు నాగసౌజన్య, కరీమున్నీసాలు మహిళా పోలీస్ స్టేషన్‌లోని విభిన్న విభాగాల గురించి వివరించారు. పోలీసులు తమ విధుల్లో ఉపయోగించే అధునిక ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలు, సెఫ్టీ గాడ్జెట్‌లు, మిషనరీ సామాగ్రిపై పై ప్రాక్టికల్ డెమో ద్వారా ఎస్ఐలు వివరించారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## పల్లె పండుగ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, మార్చి 6 ప్రభాతవార్త :
పల్లె పండుగ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి పంచాయితీ రాజ్, డ్వామా, ఎంపీడీలు, సంబంధిత అధికారులతో పల్లె పండుగలో భాగంగా మంజూరైన సీసీ రోడ్లు పనుల పురోగతిపై వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లెపండుగలో చేపట్టిన గ్రామ అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు పనులపై పురోగతిని చూపాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్,పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సవర్లకు అభిషేకాలు

## హోమాలు, పూర్ణాహుతి



శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అలంకార మండపంలో ఉత్సవర్లకు భక్తి శ్రద్ధలతో అభిషేకాలు జరిపారు. అలాగే హోమాలు నిర్వహించి పూర్ణాహుతి జరిపారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలో పూజా విధానం ప్రత్యేక శైలి ఉంటుంది. ఇతర ఆలయాల కన్నా భిన్నంగా ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ ఏడాది శివరాత్రిని ఎలాంటి ఒడుదుడుకుల్లేకుండా ప్రశాంతంగా నిర్వహించారు. 10 రోజుల పాటు పట్టణంలో ఉత్సవాలకు గ్రామోత్సవం వెళ్ళిన పంచమూర్తుల ఉత్సవర్లను భక్తి శ్రద్ధలతో అభిషేకించారు. ఆలయ అలంకార గురుకుల్స్ రాజేష్ గురుకుల్,సూరి గురుకుల్స్ ఉత్సవర్లకు షోడషాభిషేకాలు నిర్వహించారు. అలాగే స్థానిక ఆచారం మేరకు అభిషేక ప్రదానార్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్ హోమాలు ఏర్పాటు చేయగా ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తూ కార్యక్రమాలను నిర్వహించారు. వేదోక్తంగా హోమాలు నిర్వహించిన తరువాత పూర్ణాహుతి జరిపారు. దాంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పూర్తి అయ్యాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఎసి కస్తూరి,ఎఇఓ లోకేష్‌రెడ్డి,టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌ల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు. సేవాకమిటి సమితికి చెందిన నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడు,డి. లక్ష్మమ్మ,ఎం.రవి,టి.విజయకుమార్,గోపినాథ్,వి.గుర్రప్పశెట్టి, మునిరాజాయాదవ్,జ్యోతి,నెమళ్ళూరు సుబ్రమణ్యం,జి.కృష్ణవేని,పోలూరు ప్రమీల,ఎన్ సూరి నాయుడు,ఎం.సరస్వతి,కంఠారమేష్, బి.మునిలక్ష్మి,ఎం. సుబ్రమణ్యం ఒరెడ్డి, కొట్టె సాయి,అనిత,సుమతి పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. పూర్ణాహుతి తరువాత వారికి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

# అదృష్టజాతకులెవరో!?



### ఊరిస్తున్న చివరివిడత నామినేటెడ్ పదవులు !!

ప్రభాతవార్త-తిరుపతి:
రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత నామినేటెడ్ పదవులు చివరివిడత ఇచ్చేందుకు సిద్దమవుతోంది. ఇప్పటికే రెండు విడతలుగా నామినేటెడ్ పదవులు భర్తీచేసిన ప్రభుత్వం టిడిపి కార్యకర్తలకు, నాయకులకు తగిన రీతిలో పదవులు ఇవ్వలేదనే అసంతృప్తి ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశంపార్టీకి మూడునాలుగు దశాబ్దాలుగా కష్టకాలంలోనూ కష్టపడిన కేడర్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.వీరందరినీ గుర్తుంచుకుని పదవులు ఇస్తానని ఇప్పటికే చంద్రబాబు ప్రకటించారు కూడా. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ప్రకటించిన రెండవ విడతల నామినేటెడ్ పదవుల్లో సొంత పార్టీలో ఎవరికీ దక్కలేదనేది అసహనంతో కొట్టుమిట్టాడుతున్నారు.టిటిడి బోర్డులో కూడా తిరుపతి నుండి బిజెపికి చెందిన భానుప్రకాష్‌రెడ్డికి రెండవసారి అవకాశం కల్పించారు. చంద్రగిరి నియోజకవర్గంనుండి కొట్టాలకు చెందిన బంధువు అనిమిని రవినాయుడుకు శాప్ ఛైర్మన్‌గా, కుప్పంకు చెందిన పార్టీసీనియర్‌నాయకుడు పిఎస్ మునిరత్నంకు ఆర్టీసి ఛైర్మన్‌గా, టిటిడి బోర్డులో వైద్యం శాంతారామ్‌కు సభ్యుడుగా పదవులు దక్కాయి. పూతలపట్టునియోజకవర్గంకు చెందిన పెనుమూరు ప్రాంత వాసి, వ్యాపారవేత్త,బిఆర్‌నాయుడుకు టిటిడి ఛైర్మన్ పదవిని కట్టబెట్టారు. తిరుచానూరుకు చెందిన సిఆర్‌రాజన్ చిత్తూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఇంకా ఒకరిద్దరు పదవులు దక్కించుకున్నారు. ఎన్నో కీలక పదవులు ఇచ్చేయడంతో ఇప్పుడు మలివిడత నామినేటెడ్ పదవులు కూడా పార్టీకి కష్టపడిన తిరుపతికి చెందిన టిడిపి సీనియర్‌నేతలు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు అదృష్టం ఉందా లేదా అనేది సందిగ్ధమే. తుడ ఛైర్మన్ పదవి ప్రకటన కూడా నాన్చుతూనే ఉన్నారు. తిరుపతిలో కొందరు నాయకులు వర్గాలుగా విడిపోయి పార్టీకి నష్టం కలిగించారనేది అధిష్టానం దృష్టిలో ఉంది. గతంలో జరిగిన తిరుపతి నగరపాలకసంస్థ కౌన్సిల్ ఎన్నికలు, తిరుపతి టౌన్‌బ్యాంకు ఎన్నికలు, తిరుపతి ఎంపి ఉప ఎన్నికలను టిడిపి నేతలు సై అంటే సై అనేరీతిలో ఎదుర్కోలేక వైసిపితో పోరాటం చేయలేక చతికిలపడ్డారనేది బాబు గ్రహించిన వాస్తవం. ఒకానొక దశలో పార్టీలో తెలుగుతమ్ముళ్ళనందరినీ కలుపుకుని వెళ్ళేందుకు పరిశీలకులను పంపే పరిస్థితి ఎదురైంది. పార్టీలో బలమైన నేతలు,కొందరు సీనియర్ నేతలు కూడా అసహనంతోనే ఇమడలేక కొనసాగుతున్నారు. తిరుపతి,శ్రీకాళహస్తి, నగరి, చంద్రగిరి, చిత్తూరు నియోజకవర్గాల నుండి కూటమి పార్టీల్లో టిడిపికే అధికసంఖ్యలో కేడర్ బలంఉంది. ప్రాధాన్యత ఉన్న నాయకులు ఉన్నారు. మరీ వీరిలో చివరి విడత పదువుల కేటాయింపులో ఎవరికి లక్కు ఉందోననేది మరో రెండు వారాలు నిరీక్షణ తప్పదు.

## ఉచితంగా కక్షిదారులకు సత్వర న్యాయం

### రేపు జాతీయ లోక్‌దాలత్ -
### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి



చిత్తూరురూరల్, మార్చి 6 ప్రభాతవార్త:
దీర్ఘకాలికంగా కోర్టుల్లో దావాలు వేసుకుని కేసులు పరిష్కారం కాకుండా వున్న కక్షిదారులకు ఉచితంగా సత్వర న్యాయం అందించడానికి జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో గురువారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా వున్న అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు 32 బెంచ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా కోర్టుల్లో శని వారం జరిగే జాతీయ లోక్‌అదాలత్‌కు న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీలు, బీమా సంస్థల ప్రతినిధులు, కక్షిదారులువిజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## ఆహో...ఏమి రుచీ..! తిననా మైమరచి !!

### -అన్నప్రసాదం మెనూలో ఇక మసాలవడ



తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచికరంగా, శుచిగా వడ్డిస్తున్న అన్నప్రసాదంలో ఇక మసాలవడ కూడా అదనంగా వడ్డిస్తున్నారు. ఈ నూతన విధానాన్ని గురువారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ శ్యామలరావు, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదభవనంలో లాంఛనంగా ప్రారంభించారు. టిటిడి ఛైర్మన్‌గా బిఆర్‌నాయుడు ప్రమాణస్వీకారం అనంతరం భక్తులకు అన్నప్రసాదంలో అదనంగా ఒక పదార్థం వడ్డించాలని ఆలోచన కలిగింది. అన్నప్రసాదం కేంద్రంలో ఇకపై ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు 35వేల వడలను తయారుచేసి భక్తులకు వడ్డించనున్నట్లు ఛైర్మన్ నాయుడు తెలిపారు.

### ఉచిత ఇసుక పేదలకా.

## రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులకా..?

### ..ఇసుక దందాకు అడ్డాగా మారుతున్న డి.వి.సత్రం..



దొరవారిసత్రం , మార్చి 6 ప్రభాతవార్త
తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలో ఉచిత ఇసుక ముసుగులో సాగిస్తున్న అక్రమ ఇసుక మాఫియాకు రైతులు బలి అవుతున్నారు. మండల సమీపంలో సుమారు 20 కి.మీ స్వర్ణముఖి, కాళంగి నదీతీరం ఉండడంతో వాటి మీద ఆదారపడి రైతులు వ్యవసాయం సాగిస్తున్నారు.కాని గత రెండు నెలలుగా కొంత మంది ఇసుక మాఫియా వ్యాపారస్తులు నదీ తీరంలోని ఇసుకను ఇష్టానుసారంగా ఎక్కడ పడితే అక్కడ తవ్వుకుని పక్క రాస్ట్రాలకు,రియలస్టేటు వెంచర్లకు,కంపెనీలకు అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.ఇష్టానుసారంగా ఇసుక తవ్వడం వల్ల నీటి యెద్దడి తగ్గి వ్యవసాయానికి నీటి సమస్య ఏర్పడుతుందని ,నదీ తీరంలో రైతులు ఏర్పాటు చేసుకున్న మోటరు పైపులైన్లు కూడా ద్వంసం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.ఈ విసయమై అధికారులకు పలు మార్లు చెప్పిన ప్రభుత్వం ఉచిత ఇసుక విదానం మేము ఏమి చేయగలం అంటు సమాదానం ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు.

**ఇసుక దందాకు అడ్డాగా మారుతున్న డి.వి.సత్రం**

ఉచిత ఇసుక పేదలకా..అక్రమ ఇసుక వ్యాపారస్తులకా.. ఎవరికోసం ప్రభుత్వం ఈ విదానాన్ని తీసుకోచ్చిందో అర్దంకావటంలేదని మండలంలోని ప్రజలు ,రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక సరైన విధివిదానాలు లేకపోవడంవల్ల,అధికారుల పర్యవేక్షనాలోపంతో దారి తప్పి ధళారుల అక్రమ సంపాదనకు మార్గంగా మారవుతుందని ప్రజలు వాపోతునప్నారు. ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాల్లో ఇసుక రీచులను ఏర్పాటు చేసి దొరవారిసత్రం మండలంలో ఇసుక రీచ్ పాయింటుని ఏర్పాటు చేయకపోవడంతో చుట్టుపక్కల మండలాల నుండి ఇసుక మాఫియా వక్తులు ఇక్కడికి వచ్చి అక్రమంగా రాత్రి,పగలు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు జరిపి ఇష్టానుసారంగా పక్క రాష్టాలకు,కంపెనీల సెజ్‌లకు తరలిస్తునారని స్తానికులు వాపోతున్నారు.ఇకనైనా ప్రభుత్వం చొరవతీసుకుని అక్రమ ఇసుక మాఫియాను అడ్డుకోవాలని, ఈ అక్రమ ఇసుక దందాకు సహకరిస్తున్న అధికారులపై, నాయకులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# ఉచిత ఇసుక..ఊరు దాటుతుంది..!

### గంగవరంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా..!
### లక్షల్లో దందా..
### అక్రమానికి అండగా మారుతున్న అధికారులు





జేసిబితో చెరువులో అక్రమంగా ఇసుకను తోడుతున్న దృశ్యం, అప్పిరెడ్డి చెరువులో భారీగా అక్రమంగా నిల్వవుంచిన డంపు

గంగవరం,మార్చి 6, ప్రభాతవార్త :
అడ్డు అదుపులేకుండా అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలించేందుకు మాఫియాగా మారిన కొందరు చేస్తున్న ఆగడాలు ఆగేలా లేకుండా పోతున్న పరిస్థితి.ప్రతి పేదవాడు నిర్మించుకునే ఇళ్లకు ఇసుక భారం కాకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు పరచిన ఉచిత ఇసుక విధానం గాడితప్పుతుంది.స్థానిక నదులు,చెరువులు,వంకల ద్వారా ఎవరైనా ఉచితంగా ఇసుకను తీసుకోవచ్చని ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే.అంతే కాకుండా గ్రామాలకు దగ్గరలో ఉండే వంకలు,వాగులలో కూడా ఇసుకను ఎద్దుల బండ్లతో తీసుకెళ్లచ్చని కూడా ప్రభుత్వం విధివిధానాలను తెరపైకి తెచ్చింది.అయితే ఉచిత ఇసుక అంతా భ్రమ ఎందుకంటే ఉచిత ఇసుక అంతా దళారుల చేతుల్లో ఉంది.అధికారుల కనుసన్నల్లోనే అక్రమార్కులు ఉచిత ఇసుకను ఊరు దాట్టిస్తున్నారు. పలమనేరు నియోజకర్గం అసలే పడమటి మండలాలు కావడంతో నీటి వనరులు అంతంతమాత్రంగానే నిల్వ ఉన్న ఇసుక పరిమాణాలను ఇటు రైతులు,అటు ప్రజలకు తాగు,సాగు నీటి వనరులను అందించేందుకు ఉపయోగపడుతుంది.కానీ ఇలాంటి ముందస్తు జాగ్రత్తలు పాటించని ఇసుక మాఫియా అక్రమార్కులతో అవినీతి అధికారులు కుమ్మకై రాత్రి పగలు అనే తేడా లేకుండా విచ్చల విడిగా ఇసుకను తోడేస్తున్నారు.వివరాల్లోకి వెళితే..మండలంలోని చిన్నూరు గ్రామానికి చెందిన ఓ అక్రమార్కుడు మండలంలోని ఓ యువనాయకుడితో ఒప్పందం కుదుర్చుకుని ఇసుక అక్రమ రవాణాకు తెరలేపాడు. ఇసుక అక్రమార్కుడు కుమ్మకై గంగవరం రెవెన్యూ పరిధిలోని నడింపల్లె గ్రామ సమీపంలోని అప్పిరెడ్డి చెరువులో జేసిబి యంత్రాల సహాయంతో ఇసుకను తోడేస్తూ,చెరువును నామరూపాలు లేకుండా చేశారు.గతంలో చెరువులో ఉన్న శ్మసనాలను సైతం తోడేస్తూ..ప్రస్తుతం ఎవరైనా మృతి చెందితే చెరువులో అంత్యక్రియలు చేసుకోవడానికి కూడా వీలు లేకుండా చేశారు.పగలు చెరువులో ఇసుకను తోడి తమకు అనుకూలమైన ప్రాంతాలైన జాతీయ రహదారి పక్కన,మామిడి తోపులలో,అక్రమ లే అవుట్‌లలో అక్రమంగా నిల్వ ఉంచి రాత్రి సమయాలలో కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు టిప్పర్లు,ఐచర్ వాహనాల ద్వారా తరలిస్తూ లక్షల రూపాయలను అక్రమంగా అర్జిస్తూన్నారు.చెరువులలోనే బహిరంగంగా దాదాపు వందలాది లోడ్ల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచడమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం.ఈ అక్రమార్కుల అక్రమ రవాణాపై తహసీల్దార్ మాదవరాజుకు స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోగా అక్రమార్కులకు సమాచారం ఇచ్చి వారిని అప్రమత్తం చేయడం శోచనీయం.అంతే కాకుండా ఈ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇసుకమాఫియాపై గనులు,నీటి పారుదల,అధికారులకు ప్రజలు సమాచారం అందించినా అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి.ఏది ఏమైనప్పటికీ రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న అక్రమార్కులను అరికట్టాల్సిన బాధ్యత ఎవరిపై ఉందని పలువురు ప్రజానీకం ప్రశ్నించుకుంటున్నారు. చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టరును ప్రజలు కోరుతున్నారు.

# ఓటేరు చెరువును 'చెర' బట్టారు

### -చెఱువు కబ్జాదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
### -కలెక్టర్ హామీతో దీక్ష విరమించిన సిపిఐ నాయకులు



తిరుపతిరూరల్, మార్చి6 ప్రభాతవార్త:
ఓటేరు చెఱువును భూ కబ్జాదారుల నుండి పరిరక్షించి, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసు పెట్టాలని సిపిఐ జిల్లా కార్యధర్శి పి.మురళి డిమాండ్ చేసారు. తిరుపతిరూరల్ మండలం ఓటేరు గ్రామ పంచాయతీలోని ఓటేరు చెఱువును కాపాడాలని డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు గురువారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మాట్లాడుతూ తిరుపతి అర్బన్ అండ్ రూరల్ ప్రాంతాల్లో కోట్లాది రుపాయాలు విలువ ఖరీదు చేసే ఓటేరు చెఱువును కొంతమంది భూ కబ్జాదారులు చెఱువును పూడ్చేసి ఆక్రమించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ రెవెన్యూ రికార్డులలో 1925 నుండి 2014వరకు చెఱువుగా నమోదు కాబడి ఉందన్నారు. ఆ తర్వాత రెవెన్యూ అధికారుల చేతివాటం వల్ల ఆ భూమి ఇతరులకు కబ్జాకు గురైతుందని తెలిపారు. తిరుపతి పరిసర ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది భూ కబ్జాదారులు యదేచ్ఛగా భూములను కబ్జా చేస్తూ, ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. జాతీయ రహదారి పక్కనే కోట్లారుపాయాలు ఖరీదు చేసే ప్రభుత్వ భూమిని రాత్రికి రాత్రే ఆక్రమణకు పాల్పడుతుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. 13ఎకరాలు పైచీలుకు ఉన్న ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలి తప్ప, కబ్జాలు పాలు కాకుడదన్నారు. ప్రభుత్వ భవంతులైన కలెక్టర్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు ఈ భూమి వినియోగించాలని కోరారు.

**కలెక్టర్ ఫోన్ కాల్‌తో దీక్ష విరమణ**

ఓటేరు చెఱువు కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సిపిఐ నాయకులకు ఫోన్ చేయడంతో దీక్షను విరమించారు. చెఱువును యధాతథంగా పునరుద్దరించాలని డిమాండ్ చేసారు. అనంతరం తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.శివారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కె.రాధాక్రిష్ణ, ఏఐటియుసి నాయకులు ఎన్.శ్రీరాములు, వైయస్.మణి, ఎన్.శివ. వై.రాజా, అల్లాబక్షు, కృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటేరు చెరువు వేరు..రైతుల భూములు వేరు

### అసత్య ప్రచారాలు చేయకండి..మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీ



.శ్రీకాళహస్తి, మార్చి 6 ప్రభాతవార్త
ఓటేరు చెరువు వేరు రైతులు భూములు వేరని అసత్య ప్రచారాలు చేయవద్దని శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీ నాయుడు తెలిపారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతిలోని ఓటేరు చెరువుకు, శ్రీకాళహస్తి రైతులకు ఉన్న భూమి వేరని రైతులు చెరువును ఆక్రమించుకోలేదని ఓటేరు చెరువును కాపాడుకుంటూ రైతులకు అన్యాయం జరగకుండా వారు కొనుగోలు చేసిన భూమిపై ఎలాంటి అసత్యాలు అబాండాలు వేయవద్దని శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు కోరారు. తనపై సిపిఎం, సిపిఐ నాయకులు అబాండాలు వేయడం సరికాదని, మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను బ్లాక్ మెయిల్ చేసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. శ్రీకాళహస్తిలో ఎస్సీవీనాయుడు విలేకరులతో మాట్లాడుతూ సిపిఎం నాయకులు నాగరాజు, సిపిఐ నాయకులు మురళీ రైతులు భూములపై, తనపై ఆరోపణలు చేయడాన్ని ఎస్‌సివినాయుడు తీవ్రంగా ఖండించారు. సర్వేనంబర్ 376లో 12 ఎకరాల 45 సెంట్లు ఓటేరు చెరువని అన్ని సర్వే నంబర్ 370లో ఆరు ఎకరాల 70 సెంట్లు కసిం కాలువుందని, సర్వేనంబర్ 377లో 17 ఎకరాల 18 సెంట్లు రైతుల భూమి ఉందని తెలిపారు. చెరువు వేరే , రైతు భూములు వేరే అని వివరించారు. 1906లోనే బ్రిటీష్ వారు తయారు చేసిన ఏ రిజిస్టర్ మరియు రిజిస్ట్రీ ఆఫ్ హోల్డింగ్‌లో నమోదైనట్లు ఇది పుంజ భూమిగా నమోదైనట్లు వివరించారు. రైతులు కొన్న భూములు సర్వేనంబర్ 377లో ఉన్నదని ఈభూమిపై ఆరోపణలు వాస్తవాలు గ్రహించాలని రికార్డులు పరిశీలించి ఏది చెరువు, ఏది పుంజ భూమి తెలుసుకోవా లన్నారు. శ్రీకాళహస్తికి చెందిన రైతులు సర్వేనంబర్ 377లో భూమికి కొనుగోలు చేసిన 17 ఎకరాల 18 సెంట్లు భూమికి సంబందించి 2006లో ప్రభుత్వం తిరుపతి కోర్టులో అప్పీల్ వేయగా 2005లో మరోసారి కోర్టుకు వెళ్ళగా 2006లోను డిస్పోస్ చేస్తూ హైకోర్టులో రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో సత్రవాడ ప్రవీణ్, అంజూరు రఘురాం, గోగినేని భాస్కర్‌నాయుడు, స్వామి, మేకల జయరాం, అంజూరు సుధాకర్, కిషోర్, సర్పంచ్ బాలాజీనాయుడు, మాజీ సర్పంచ్ హరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వృద్ధురాలు ఆత్మహత్య



**రేణిగుంట మార్చి 6 ప్రభాతవార్త** రేణిగుంట మండలం వెదల్ల చెరువు ఎస్సీ కాలనీ కి చెందిన సరస్వతమ్మ (75) మతిస్థిమితం సరిగా లేక గురువారం గ్రామానికి చెందిన ఓ మామిడి తోటలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. రేణిగుంట అర్బన్ స్టేషన్ రైటర్ గౌరీ నాయుడు కథనం మేరకు సరస్వతమ్మ ఆమె అక్క తులసమ్మ గత 20 సంవత్సరాల క్రితం ఆరోగ్యం సరిగా లేక చనిపోయింది. అప్పటినుండి నుండి సరస్వతమ్మకు మతి స్థిమితం సరిగాలేదని కుటుంబ సభ్యులు అంటున్నారు. ఈ క్రమంలో బంధువులంతా ఊర్లో లేనప్పుడు గ్రామంలోని మామిడి తోటలో ఓ మామిడి చెట్టుకు చీరతో ఉరేసుకుని మృతి చెందినట్లు బంధువులు ఫిర్యాదు చేశారు. రేణిగుంట అర్బన్ సీఐ శరత్ చంద్ర ఆదేశాల మేరకు, ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలం చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉన్నత విద్యకు మార్గదర్శి ఎన్ స్క్వేర్ కన్సల్టెన్సీ



**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాతవార్త** విద్యార్థుల, తల్లిదండ్రుల ఉన్నత లక్ష్యాలకు మార్గదర్శిగా ఎన్ స్క్వాయర్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ పనిచేస్తుందని ఆ సంస్థ డైరెక్టర్లు రమణ, రాజశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ఎయిర్ బైపాస్రోడ్డులో గురువారం స్క్వాయర్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కన్సల్టెన్సీ డైరెక్టర్లు మాట్లాడుతూ ఎంతో మంది మధ్యతరగతి, పేద విద్యార్థులు డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ, ఎంసీఏ, అగ్రికల్చరల్, కామర్స్, ఆర్ట్స్ విభాగాలలో చేరేందుకు సరైన గైడెన్స్ లేకపోవడంతో తాము ఎంచుకున్న ఉన్నత విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. గత 18ఏళ్ల నుంచి మా సంస్థ ఎంతో మంది విద్యార్థులకు పలు కోర్సులో అడ్మిషన్లు కల్పించడం జరిగిందన్నారు. తమిళనాడులోని ఎస్ఆర్ఎమ్, అమృత, వీఐటీ సాయి, తక్షిశిల వర్సిటీ వంటి పేరొందిన డీమ్డ్ వర్సిటీలలో ప్రవేశాలకు సంబంధించి ఆసక్తిగల విద్యార్థులకు సహాయసహకారాలు అందించి వారి కలను నెరవేరుస్తామని చెప్పారు. ఎంబీబీఎస్ అడ్మిషన్ల విషయంలోనూ చిత్తూరు అపోలో, నారాయణ, నంద్యాల శాంతీరామ్ మెడికల్ కళాశాలలో ప్రవేశాలకు గైడెన్స్ అందిస్తామని తెలిపారు. అడ్మిషన్ల గైడెన్స్ కోసం 9640777757, 8106020030 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## జనసేన పార్టీలోకి రిటైర్డ్ తహశీల్దార్



**శ్రీకాళహస్తి, మార్చి 6 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజ కవర్గంలో జనసేన పార్టీ బలోపేతం చేయటానికి నియోజకవర్గ ఇన్చార్జి వినూత కోట సారథ్యంలో విస్తృతస్థాయిలో రంగం సిద్ధం చేస్తున్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో రిటైర్డ్ తహశీల్దార్ చిట్టతూరు చంద్రశేఖర్‌రావు చేరారు. ఆయన్ను కొట్టెడి మధుశేఖర్ సారధ్యంలో పార్టీలో చేరినట్లు సమాచారం. రాష్ట్రఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పరిపాలనా విధానం నచ్చి పార్టీలో చేరినట్లు చంద్రశేఖర్ వివరించారు. తనకున్న అనుభవంతో పార్టీని బలోపేతం చేయటానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వినూతతో పాటు పట్టణ అధ్యక్షుడు తోటగణేష్, తొట్టంబేడు ఇన్‌చార్జి చంద్రశేఖర్ కావలి శివకుమార్, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ వెంకటరమణయాదవ్ దుమ్మురాయల్ తదితరులు పాల్గొన్నారు.

## కక్షసాధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, మార్చి 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిపట్టణంలోని తొమ్మిదవవార్డుకు చెందినన పార్వతి సమాఖ్యకు చెందిన దళిత ఆర్పి గురువారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. అయితే కుటుంబసభ్యులు గమనించి వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి కథనం మేరకు పట్టణంలోని 9వ వవార్డులో పార్వతీదేవి సమాఖ్య ఆర్‌పిగా సరళమ్మ ఆరు సంవత్సరాల నుంచి పని చేస్తున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక నేతలు ఆమెను తొలగించమని వత్తిడి అధికారులపై పెరిగిందని దాంతో అధికారులు తనకు వ్యతిరేకగా వార్డు మహిళా సభ్యుల వద్ద అబద్ధపు సంతకాలు చేయించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయించారని బాదితురాలు ఆరోపించారు. తాను ఏ తప్పు చేయకున్నా సంఘాలను సమగ్రంగా నడుపుతున్నా తన ప్రమేయం లేకనే గురువారం వార్డులో సమాఖ్యను నిర్వహించటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిపారు. అయితే ఈ సంఘటనకు సంబంధించి ఆ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ సుప్రజ వివరణ ఇలా ఉంది. తన వార్డుకు సంబంధించిన మహిళా సమాఖ్యలో ఆర్‌పి సరళమ్మ ఆత్మహత్య ఓ డ్రామా అన్నారు. ఆర్‌పి నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించారన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఒకే సభ్యునికి ఒరెండు సార్లు సొమ్ములు చెల్లించారన్నారు. అంతేకాక ఆడిట్ నివేదికలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. దీనిని పరిశీలిస్తేనే ఆమె తనతప్పిదాలను కప్పిపుచ్చుకొనుటకు ఆత్మహత్య డ్రామా ఆడుతున్నారని వివరించారు. అయితే ఈ సంఘటనపై తెలుగుదేశం కూటమి నాయకుల వేధింపులకు సంబంధించి సమగ్ర విచారణ జరపాలని ఉభయ కమ్యూనిస్టులు డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి

పుత్తూరు, మార్చి 6 ప్రభాతవార్త:



పట్టణ పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునికుమార్ అనే విద్యార్థి గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన మునికుమార్, రవిశేఖర్ అలియాస్ తేజ ఇద్దరు అన్నదమ్ములు కలిసి నారాయణవనం మండల పరిధిలో వున్న వేదవ్యాస డిగ్రీ కాలేజీలో చదువుతూ బుధవారం ఉదయం 9 గంటలకు ఇద్దరు అన్నదమ్ములు ద్విచక్ర వాహనంపై కాలేజీకి వెళుతూ బుధవారం రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రమాదంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న వాహనం వెనుక కూర్చుని వున్న తమ్ముడు రవిశేఖర్ అక్కడికక్కడే మృతి చెందగా డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న అన్న మునికుమార్ తీవ్ర గాయాలై తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకే ఇంట్లో వున్న ఇద్దరు అన్నదమ్ములు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లితండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. ప్రైవేటు ఆస్పత్రిలో రూ. 12 లక్షలు ఖర్చు పెట్టినా ఫలితం దక్కలేదని ఆవేదన చెందారు. గట్టు గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నగరంలో సి.సి.కెమరాల ఏర్పాటు పక్కగా చేపట్టండి.

స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య



**తిరుపతి కార్పొరేషన్, మార్చి 6, ప్రభాతవార్త** తిరుపతి నగరంలో ఏర్పాటు చేయనున్న సి.సి. కమెరాల ఏర్పాటుకు పక్కగా చేపట్టాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న సిటీ ఆపరేషన్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, డిజైన్ స్టూడియో, గ్లో గార్డెన్, గరుడ వారధి, తదితర ప్రాజెక్టుల పనుల పురోగతిపై ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో గురువారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నగరంలో ఏర్పాటు చేయనున్న సిసి కెమెరాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ముఖ్యంగా పోలీసు, హెల్త్, ప్రణాళికా విభాగం అధికారుల పర్యవేక్షణలో ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్ లో అన్ని విభాగాలకు ఇబ్బంది లేకుండా ప్లాన్ ప్రకారం గదులు కేటాయించాలని అన్నారు. అలాగే గడువు లోపు పూర్తి నాణ్యతతో నిర్మాణాలు పూర్తి చేయాలని అన్నారు. డిజైన్ స్టూడియో ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. గ్లో గార్డెన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. గరుడ వారదిలో పెండింగ్ లో ఉన్న పనులు గడువులోపు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈఈ రవి, డి.ఈ.లు రాజు, మహేష్, మధు, డీసీపీ మహాపాత్ర, ఏసిపి బాలాజి, ఏఓ రాజశేఖర్, సిఎఫ్ఓ మల్లిఖార్జున, వివిధ ప్రాజెక్టుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమంగా రవాణా చేస్తున్న 23ఎర్రచందనం దుంగలు స్వాధీనం

– వాహనం స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లు అరెస్టు

తిరుపతి కార్పొరేషన్, మార్చి 6, ప్రభాతవార్త



జాతీయ రహదారిపై అక్రమంగా రవాణా చేస్తున్న 23 ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకుని, దానికి కారణమైన ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ మేరకు, టాస్క్ ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ జె. బాలిరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ బి సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ టి. విష్ణువర్ధన్ కుమార్ టీమ్ బుధవారం రాత్రి నుంచి కూంబింగ్ చేపట్టారు. ఇందులో భాగంగా అటవీ అధికారులు ఎఫ్ఆర్ఓ ఎస్. మాల్యాద్రి, ఎఫ్బీఓ ఆదిశేషయ్యల సహకారంతో నెల్లూరుగూడూరు జాతీయ రహదారి చవటపాళ్యం వద్దకు చేరుకుని వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆ మార్గంలో ఒక బొలేరో వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో, ఆపి తనిఖీ చేసే ప్రయత్నం చేయగా, అందులోని ముగ్గురు వ్యక్తులు పారిపోసాగారు. వారిని వెంబడించి టాస్క్ ఫోర్సు సిబ్బంది పట్టుకోగలిగారు. వాహనంలో 23ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడిన వారిని చిత్తూరు జిల్లా వాసులుగా గుర్తించి అరెస్టు చేశారు. వారిని దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు పాల్గొన్న సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## పాత ముద్దాయిని అరెస్టు చేసిన కార్వేటినగరం పోలీసులు



**కార్వేటినగరం, మార్చి 6 ప్రభాతవార్త:** పాత ముద్దాయిని అరెస్టు చేసినట్లు కార్వేటినగరం ఎస్ఐ పి. రాజ్‌కుమార్ తెలిపారు. చిత్తూరుజిల్లా యస్పి ఆదేశాల మేరకు నగరి డియస్పి పర్యవేక్షణలో కార్వేటినగరం సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 16 పోలీసుస్టేషన్‌లలోని సుమారు 31కేసులలో దొంగతనాలు, గంజాయి, మర్డర్ కేసులలో ముద్దాయిగా ఉన్నటువంటి అవనాక్షయ్య అనే మోస్ట్ వాంటెడ్ నేరస్థుడిని కార్వేటినగరం పోలీసులు ఊతుకోట వద్ద అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. అవనాక్షయ్య పైన పలు కేసులలో నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా వుందన్నారు. అతని అరెస్టులో ప్రతిభ కనబరిచిన కార్వేటినగరం పోలీసులైన రాజశేఖర్, లోకనాధం, యువరాజులను యస్.పి. అభినందినట్లు తెలిపారు.

## పదో తరగతి విద్యార్థులకు వితరణ

**విజయపురం, మార్చి 6 ప్రభాతవార్త:** మండలంలోని విజయపురం ఉన్నత పాఠశాలలో గురువారం రిటైర్డ్ ఉపాధ్యాయులు రామచంద్రరాజు, చంద్రయ్య 48 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామల చేతుల మీదుగా వితరణగా అందించారు. అనంతరం పదో తరగతి పబ్లిక్ రాసే విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమవంతు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 15 సంవత్సరాల భూ సమస్య పరిష్కారం

**విజయపురం, మార్చి 6 ప్రభాతవార్త:** 15 సంవత్సరాల భూ సమస్య పరిష్కారమైందని మండలంలోని మాధవరానికి చెందిన ఏకుమలై పండారం తెలిపారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయి పట్టించుకోకుండా వదిలేశానని,



కూటమి ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీ పెట్టుకుంటే తహసీల్దార్ కిరణ్ స్పందించి పరిష్కారం చేసి గురువారం వన్ బీ అందించారని తెలిపారు. ముఖ్యమంత్రికి, అధికారులకు ధన్యవాదాలుతెలిపారు. కార్యక్రమంలో మార్కండేయులు, వీఆర్వో మేఘనాథం తదితరులు పాల్గొన్నారు.

## బిఎన్ఐతో డైమండ్స్ ద్వారా వ్యాపారాభివృద్ధి

తిరుపతి విద్య, మార్చి 6 ప్రభాతవార్త

బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ (బిఎన్ఐ) వేదిక ద్వారా స్థానిక వ్యాపారాలు గ్లోబల్ స్థాయికి ఎదిగే అవకాశం ఉందని బిఎన్ఐ డైమండ్స్ తిరుపతి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం తిరుపతి గ్రామీణ ప్రాంతంలోని ప్రముఖ హోటల్లో 150 మందితో వ్యాపార యజమానులతో బిఎన్ఐ డైమండ్స్ తిరుపతి చాప్టర్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి చాప్టర్ అధ్యక్షులు టెంకాయల దుర్గాప్రసాద్, బిఎన్ఐ సీనియర్ సపోర్ట్ డైరెక్టర్ సాయికిరణ్ రెడ్డితో కలిసి ఈడి సంతోష్ మీడియాతో మాట్లాడారు. బిఎన్ఐ ద్వారా దేశవ్యాప్తంగా ఎంతోమంది చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి నేడు గ్లోబల్ స్థాయిలో తమ వ్యాపారాల ఉత్పత్తులను విక్రయం చేసుకునే విధంగా ఎదిగారన్నారు. రిఫరల్ వ్యాపారం ద్వారా సంస్థ యజమానులు మరింత లాభాలు గడించే కార్యక్రమాలను బిఎన్ఐ డైమండ్స్ నిర్వహిస్తుందన్నారు. లాంచ్ కార్యక్రమానికి హాజరైన వ్యాపార సంస్థల నిర్వాహకులు వారికున్న సందేహాలను బిఎన్ఐ ప్రతినిధులతో మాట్లాడి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లాంచ్ డైరెక్టర్ స్వాతి వుడుమ, తిరుపతి చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ యువరాజ్ జైన్, సెక్రటరీ, కోశాధికారి డి.దేవి, లీడ్ విజిటర్ పోస్ట్ హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమం



**తిరుపతి విద్య, మార్చి 6 ప్రభాతవార్త** అంతర్జాతీయ మహిళా దినోత్సవం యొక్క చరిత్ర మరియు ప్రాముఖ్యత పై అందరికీ అవగాహన అవసరమని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ కోన ప్రభ తెలిపారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకొని వారోత్సవాలలో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసోసియేట్ డా.కోన ప్రభ, తిరుపతి లోని నందమూరి తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారిత కేంద్రం(మహిళా ప్రాంగణం) లోని టైలరింగ్, బ్యూటీషియన్, నర్సింగ్ కోర్సు ల విద్యార్థునులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ డా.ఫర్జానా, మహిళా అధ్యయన కేంద్ర ఆఫీస్ అసిస్టెంట్ డా.సుచరిత, విద్యార్థునులు పాల్గొన్నారు.

## సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టిన పద్మావతి



**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాత వార్త** ఎస్వీయూ సైన్స్ కళాశాల నూతన ప్రిన్సిపల్గా ప్రొఫెసర్ పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు 31ఏళ్ల బోధన, పరిశోధన రంగాలలో విశేష అనుభవం ఉండటంతో వీసీ, రిజిస్ట్రార్ ఆమెను ప్రిన్సిపల్గా నియమించారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

## విద్యతో అసాధ్యం కానిది లేదు... కోటేశ్వరరావు.

రేణిగుంట మార్చి 6 ప్రభాతవార్త



విద్యావంతునకు అసాధ్యమైన పని లేదని ఆంధ్రశ్రీ అవార్డు పురస్కార గ్రహీత యల్లంపాటి కోటేశ్వరబాబు అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని నాలుగు మండలాల్లో అన్ని పాఠశాలలందు చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీలో భాగంగా గురువారం కోటేశ్వరబాబు రేణిగుంట మండలం గాజుల మండ్యం, గుత్తి వారి పల్లె, అన్నసంపల్లె, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు తదితర పరీక్ష సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగలు దోచ లేని అపూర్వ సంపద విద్య అన్నారు. విద్యావంతునకు ప్రపంచంలో ఎక్కడైనా గౌరవం ఉంటుందన్నారు. విద్యను పట్టుదలతో అభ్యసించి కృతార్థులు కావాల్సిన ఆవశ్యకత విద్యార్థులపై ఉందన్నారు. విద్యార్థులకు ఉత్తమమైన విద్యను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై అంతకుమించి ఉందన్నారు. గాజులమండ్యం, గుత్తివారిపల్లె, అన్నసంపల్లె ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, పురుషోత్తం, సునీత తదితరులతో పాటు పాఠశాలల బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి సార్...

**నాగలాపురం, మార్చి 6 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిం చాలని ఎమ్మెల్యే ఆదిమూలం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీ అనంతరం మంత్రి లోకేష్‌ని ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలసి తన



నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, శ్మశనాలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల ఆధునికీకరణ, పేదలకు ఇంటి పట్టాలు, తుఫానుకు కూలిన వంతెనలు మరమ్మతు పనులపై ప్రధానంగా విన్నవించినట్లు వెల్లడించారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ తప్పక అన్ని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కలయిక సందర్భంగా మంత్రి లోకేష్ ఎమ్మెల్యే నుంచి వినతులను స్వీకరిస్తూ అన్నా ఆరోగ్యం జాగ్రత్త అంటూ ఆప్యాయంగా పలకరించడం జరిగిందని తెలిపారు.

## లైన్‌మేన్‌కు ఎంపీపీ చేతుల మీదుగా సన్మానం



**నాగలాపురం, మార్చి 6 ప్రభాతవార్త:** ఉత్తమ లైన్‌మేన్ శరవణ కు మంగళవారం ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ భర్త వైసీపీ మండల జనరల్ సెక్రటరీ సింధుశ్యాం ఆధ్వర్యంలో లైన్‌మేన్ శరవణకు శాలువ కప్పి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దేశప్పన్, వార్డు మెంబరు ఉదయ్‌కుమార్, వైసీపీ సీనియర్ నాయకులు చెల్లయ్య, మాజీ వార్డు మెంబరు బాబు, యువ నాయకులు ప్రశాంత్, డిల్లీబాబు, ఆకాష్, మాజీ ఎంపీటీసీ కుమారుడు సాయి నితీష్, బెస్ట్ వలంటీరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించిన తితిదే ఛైర్మన్



**తిరుపతి విద్య మార్చి 6 ప్రభాత వార్త** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర విభాగ ఆచార్యులు జె.కామాక్షమ్మ నిర్వహించే "సాంప్రదాయ ఔషధము ఆధునిక, సహజ ఆరోగ్య రక్షణ ఏకీకృత విధానం" అనే అంశంపై ఏప్రిల్ 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సు కరపత్రాన్ని తిరుమలలో తితిదే ఛైర్మన్ అధికారిక భవనంలో ఛైర్మన్ బి ఆర్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ ఔషధం ఆధునిక చికిత్స విధానంలో అనుసంధానం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర విభాగాధిపతి ఆచార్య నాగలక్ష్మి దేవమ్మ, డా.చింత చంద్ర పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రేపటి నుండి తుడా టవర్స్ వేలంకు ఏర్పాట్లు పూర్తి

తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య



**తిరుపతి కార్పొరేషన్, మార్చి 6, ప్రభాతవార్త** తిరుపతి నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నిర్మిస్తున్న తుడా టవర్స్ కి మార్చి 8 వ తేదీ నుండి వేలం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య తెలిపారు. గురువారం ఉదయం నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్ ని ఇంజినీరింగ్ అధికారులతో పరిశీలించి, వేలం నిర్వహణపై తుడా కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య మాట్లాడుతూ తిరుపతి నగరంలోని రాయలచెరువు రోడ్డులో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ తుడా టవర్స్ ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా 3.6 ఎకరాల స్థలంలో నిర్మిస్తున్నామని అన్నారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు 13 అంతస్థులలో తుడా టవర్స్ నిర్మాణం జరుగుతోందని అన్నారు. గ్రౌండ్, ఒకటవ అంతస్థుల్లో 27 దుకాణాలతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన అంతస్థుల్లో నివాస యోగ్యంగా 2,3,4 బెడ్ రూమ్ ఫ్లాట్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. నివసించేందుకు 230 ఫ్లాట్లు ఉంటాయని, అందులో 46 డబుల్ బెడ్ రూమ్స్, 152 ట్రిబుల్ బెడ్ రూమ్స్, 32 నాలుగు బెడ్ రూమ్స్ ఫ్లాట్స్ ఉంటాయని అన్నారు. మార్చి 8 వ తేదీ 2,3 అంతస్తులకు, 9వ తేదీ 4,5, అంతస్తులకు, 10 వ తేదీ 6, 7 అంతస్తులకు, 11 వ తేదీ 8,9 అంతస్తులకు, 12 వ తేదీ 10, 11 అంతస్తులకు ఉదయం 10 నుండి 1 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 6 గంటల వరకు వేలం నిర్వహిస్తామని అన్నారు. ఈ పరిశీలన సమావేశంలో కార్యదర్శి వెంకట నారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, తదితరులు ఉన్నారు.

## బాలల లైంగిక వేధింపులపై అవగాహన, నివారణ నైపుణ్యాలపై శిక్షణ



**తిరుపతి హెల్త్, మార్చి 6 ప్రభాతవార్త :** రుయా ఆస్పత్రిలో గురువారం బాలల లైంగిక వేధింపులపై అవగాహన, నివారణ, నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బాల కృష్ణ నాయక్ తెలిపారు. డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు లాబరేటరీలు లింగనిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇచ్చినా పీసీపీ ఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు.

## మీడియాకు, పవన్ కల్యాణ్‌కు రుణపడి ఉంటా

**తిరుపతి హెల్త్, మార్చి 6 ప్రభాతవార్త :** మీడియా, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రుణపడి ఉంటానని జనసేన నేత కిరణ్‌రాయల్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు లక్ష్మిరెడ్డికి మధ్య ఆర్థిక లావాదేవీలు ఎప్పుడో ముగిశాయన్నారు. నన్ను రాజకీయంగా తొక్కాలని కొంత మంది నన్ను నా కుటుంబాన్ని టార్గెట్ చేశారన్నారు. నాపై జరిగిన కుట్రలో ఉన్న వారందరి జాతకాలు నా దగ్గర ఉన్నాయన్నారు. సాక్ష్యాలతో అన్ని అధినేత పవన్ కల్యాణ్ వద్ద ఉంచుతానన్నారు.

## ప్రభుత్వ భూములకు పరిహారం చెల్లించొద్దు - సీపీఎం

**సత్యవేడు, మార్చి 6 ప్రభాతవార్త:** సత్యవేడు మండలం ఇరుగుళం కొల్లడం, పెద్ద ఈటిపాకం, చిన్న ఈటిపాకం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జనార్ధన్ మాట్లాడుతూ పారిశ్రామిక అవసరాల కోసం చేస్తున్న భూ



సేకరణలో ఒరిజినల్ పట్టాలు కలిగిన రైతులకు మాత్రమే పరిహారం చెల్లించాలని ప్రభుత్వ భూములకు సంబంధం లేని వ్యక్తుల పేర్లను నోటిఫికేషన్‌లో చేర్చి అక్రమంగా డబ్బులు పొందాలని చూస్తున్న వారికి పరిహారం చెల్లించవద్దని పేర్కొన్నారు. సీపీఎం పార్టీ జిల్లా సత్యవేడు మండల కార్యదర్శి మెలుగు రమేష్, రైతు సంఘం జిల్లా నాయకుడు జయరాచంద్రరెడ్డి ఆర్డీవోకి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఇరుగుళం రెవెన్యూలో సర్వే 162/1లో 3 ఎకరాల 82 సెంట్లు ప్రభుత్వ భూమికి, చిన్న ఈటిపాకం రెవెన్యూ సర్వే నెం.3బీ1లో 3 ఎకరాల 88 సెంట్లు ప్రభుత్వ భూములకు పరిహారం పొందాలని కొందరు పేర్లను నోటిఫికేషన్‌లో చేర్చి ప్రభుత్వ అధికారులు కూడా వారికి సహకరించి అక్రమంగా పరిహారం పొందాలని చూస్తున్నారని వారు విమర్శించారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్‌కి కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మునస్వామి, కృష్ణయ్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## మహనీయుల అడుగుజాడలే మహిళాభివృద్ధికి సోపానాలు



**తిరుపతి హెల్త్, మార్చి 6 ప్రభాతవార్త :** మహనీయుల అడుగు జాడలే మహిళాభివృద్ధికి సోపానాలు అని తుడా కార్యదర్శి డాక్టర్ జి. వెంకటనారాయణ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశంలో దాదాపు 140 కోట్ల జనాభాలో 70 కోట్లకు పైగా మహిళలే ఉన్నారన్నారు. అలాంటప్పుడు పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు ఉండాలన్నారు. రుయా ఆస్పత్రి డాక్టర్ రోజా రమణి మాట్లాడుతూ ఇంటి పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం ఉంటుందని, ఆ దిశగా మహిళలు ముందుకు వెళ్ళాలని సూచించారు. ఈ సందర్భంగా బాధ్యతగా ఉద్యోగాలు నిర్వహిస్తున్న మహిళలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రచయిత, జర్నలిస్టు, ప్రజా సేవ ప్రజా కళావేదిక ద్వారా అరవ జయపాల్ శాలువ, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రుక్మిణిరెడ్డి, కృష్ణకుమారి, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## కేవీబీపురం మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిణిగా సాయిపూజ



**కేవీబీ పురం, మార్చి 6 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణిగా టి.సాయిపూజ గురువారం బాధ్యతలు చేపట్టా రు. ఇక్కడ ముందు పని చేస్తున్న డాక్టర్లు కుమార్‌బాబు, వాణిలు ఇరువురు వైద్యాదికారులు వైద్య చదువుల నిమిత్తం వెళ్లినట్టు ఆ స్థానంలో తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిగా పని చేస్తున్న సాయిపూజ ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వచ్చినట్లు ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి, పిచ్చాటూరులకు మధ్య వైద్యం అందించ డానికి ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ వైద్య కేంద్రంలో 24 గంటలు వైద్యం అందించడానికి ఉన్నామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలనిసాయిపూజతెలిపారు. పీహెచ్‌సీసిబ్బంది, ల్యాబ్‌టెక్నిషియన్, స్టాఫ్‌నర్సు లుపాల్గొన్నారు.

## అన్ని దానాలలో కల్లా విద్యా దానం గొప్పది

తిరుపతి విద్య, మార్చి 6 ప్రభాతవార్త



అన్ని దానాలలో కల్లా విద్యా దానం గొప్పది అని డాక్టర్ సి.వెంకట్ లక్ష్మి అన్నారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు న్యూ బాలాజీ కాలనీలో ఉన్న భాష్యం బృహస్పతి క్యాంపస్ జోనల్ ఇన్చార్జి లక్ష్మణ్ ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ అప్లైడ్ మ్యాథమెటిక్స్ డాక్టర్ సి వెంకటలక్ష్మి హాజరై మాట్లాడారు. అన్ని దానాలలో కల్లా విద్య దానం గొప్పదని, ఒక వ్యక్తి చదువుకుంటే వారి కుటుంబం విద్యావంతులు అవుతారన్నారు. దేశ అభివృద్ధికి విద్య మూలమని, క్రమశిక్షణ నైతిక విలువలు మంచి ప్రవర్తన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచి ఉన్నత విద్య మారేకొద్దీ మార్పుకు తగినట్లుగా విద్యను అభ్యసించి ఉన్నతకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం యూకేజీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను పంపిణీ చేశారు. భాష్యం బృహ స్పతిప్రధానోపాధ్యాయులు నేతాజీ, ఇన్చార్జిలావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కలెక్టర్ గారూ...మీరైనా నాకు న్యాయం చేయండి సారూ...!

తిరుపతి కలెక్టరేట్, మార్చి 6 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ గారూ... మీరైనా న్యాయం చేసి నా ఇల్లు నాకు ఇప్పించండి సారూ...! అని తిమ్మినాయుడు పాళ్యం రెడ్డిగుంటకు చెందిన బాధితురాలు బిడ్ల లక్ష్మి విజ్ఞప్తి చేశారు. గురువారం బాధితురాలు బి.లక్ష్మి మీడియాతో మాట్లాడుతూ తిరుచానూరు గ్రామ పంచాయతీ యోగిమల్లవరం (వీవీ నగర్) రెసిడెన్సీ ఏరియాలో నెం.36రు తిరుచానూరు రెవెన్యూ లెక్క దాఖల సర్వే నెం.280/1లో 3 ఎకరాల 83 సెంట్ల భూమిలో 1995లోఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వేసిన లేఅవుట్‌లో 82 ఫ్లాట్‌లు వేయడం జరిగిందన్నారు. తాను 57వ ఫ్లాట్‌ను డోర్ నెం. 10-128/19-7/3 జీ ప్లస్2 ఇంటితో కలిపి హైదరాబాద్‌కు చెందిన ముద్దాపురం శ్రీకాంత్ గౌడ్ అనే వ్యక్తి నుంచి ఆగష్టు 24, 2021న కొనుగోలు చేసి రేణిగుంట సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో రిజిస్ట్రర్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. కొంత మంది దళారులు కలిసి నేను కొన్న ఇంటికి తప్పుడు పత్రాలు సృష్టించి నా ఇల్లును ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె బాధపడ్డారు. దీనిపై సంబంధిత పోలీస్‌స్టేషన్, రెవెన్యూ, గ్రామ పంచాయితీ అధికారులను సంప్రదించినా సివిల్ కేసుగా గుర్తించి కోర్టు వెళ్ళమని సలహా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే నాకు సర్వ హక్కులు కలిగిన నా ఇంటి కోసం నేను కోర్టుకు వెళ్ళడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నాకు న్యాయం చేయాలని, నుంచి ప్రాణరక్షణ కల్పించాలని బాధితురాలు లక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు.

## పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం



వెంకటగిరి, మార్చి 6 ప్రభాతవార్త : ఈనెల 17వ తేదీ నుంచి జరగబోవు పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు లలిత శివజ్యోతి ఆకాంక్షించారు. బాలాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సరస్వతి పూజను పాఠశాలలో సరస్వతి విగ్రహానికి పూలమాల వేసి పూజలు విద్యార్థిని విద్యార్థులు నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతీదేవికి బెల్లం సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. సరస్వతి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అందరూ పరీక్షలు బాగా రాసి నూరుశాతం వచ్చేంత సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు లలిత శివజ్యోతి విద్యార్థులను కోరారు.

## అర్హులందరికీ పరిహారం : సబ్ కలెక్టర్



కోట, మార్చి 6 ప్రభాతవార్త : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులో ప్రభుత్వ భూముల్లో సాగులో ఉన్న అర్హులైన వారందరికీ పరిహారం అందజేస్తామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. గురువారం కొత్తపట్నం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.8 లక్షల మేరకు పరిహారం అందజేస్తామని స్పష్టం చేశారు. జిఓ నంబర్ 43 ప్రకారం 213 మంది లబ్ధిదారులు 367 ఎకరాల 98 సెంట్లలో సాగు చేస్తున్నారని తెలిపారు. వారందరికీ పరిహారం ఇస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏడురోజుల్లోగా సబ్ కలెక్టర్‌కి అన్ని ఆధారాలతో అర్జీలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ విజయభారత్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ శేఖర్‌రెడ్డి, తహశీల్దార్ కె.జయజయరావు, డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ మధులత, సర్పంచ్ తిరుపాలయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ఉప్పు నీళ్లు, మంచినీళ్లతో కలిసి పోతున్నాయి

**-సూళ్లూరుపేటను ఆదుకోండి -అసెంబ్లీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, మార్చి 6 ప్రభాతవార్త : పులికాట్ సరస్సులోని ఉప్పు నీళ్లు, కాళంగి నది మంచినీళ్లతో కలిసిపోవడం వలన, సూళూరుపేట పరిసర ప్రాంతాలు ఉప్పునీటి మయంగా మారాయని, ప్రభుత్వం ఈ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణమరాజు స్పీకర్ స్థానంలో ఉండి నెలవల విజయశ్రీకి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే రెండవ అతిపెద్ద ఉప్పునీటి సరస్సు అయిన పులికాట్ సరస్సులో వర్షాల సమయంలో, కాళంగి మంచినీళ్లు కలుస్తాయని, అయితే నదిలో నీళ్లు తక్కువగా ఉన్నప్పుడు ఆటుపోట్ల కారణంగా ఉప్పునీళ్లు మంచినీటితో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తడ మండలం వాటంబేడు సమీపంలో నది, సరస్సు కలిసేచోట గ్రాయను ఏర్పాటు చేశారని, పదేళ్ల క్రితం ఆ గ్రామాలు వరదలకు కొట్టుకుపోయిందని ఎమ్మెల్యే తెలిపారు. మళ్లీ అక్కడ ప్రత్యామ్నాయం లేకపోవడంతో సరస్సులోని నీళ్లు నదిలోని మంచినీళ్లతో కలిసి తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల దాకా ప్రవహించి రైతులకు ఉపయోగం లేకుండా పోతున్నాయన్నారు. దీనికితోడు సూళ్లూరుపేట సమీప గ్రామాలు, పట్టణంలో కూడా భూగర్భ జలాలు ఉప్పు నీళ్లుగా మారి మంచినీటి సమస్య ఏర్పడిందన్నారు. వాటంబేడు వద్ద చెక్‌డ్యాం పటిష్టంగా నిర్మించి ఏ సమయంలోనూ ఉప్పునీరు మంచినీళ్లతో కలవకుండా చర్యలు తీసుకుంటే నియోజకవర్గంలోని సుమారు 30వేల మందికి ఇబ్బందులు తప్పుతాయని చెప్పారు. నీటిపారుదలశాఖమంత్రి ఈ సమస్యను పరిశీలించి చెక్‌డ్యాం నిర్మించి తమను ఆదుకోవాలని విజయశ్రీ ఈ సందర్భంగా కోరారు.

## పోలీసుల అదుపులో... సింగిల్ నెంబర్ లాటరీ జూదర్లు!

**-వార్త దినపత్రిక కథనానికి స్పందించిన పోలీసులు**

నాయుడుపేట, మార్చి 6 ప్రభాతవార్త; నాయుడుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా సింగిల్ నెంబరు లాటరీలు నిర్వహిస్తూ లక్షల రూపాయలు పోగొట్టుకొని నిర్వాహకుల వేదింపులు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్న శీర్షిక వార్తదినపత్రికలో ప్రచురితం కావడంతో స్పందించిన నాయుడుపేట సిఐ బాబి తనసిబ్బందితో కలిసి బుధవారం రాత్రి సింగిల్ నెంబర్ లాటరీ స్థావరాలపై మాటువేసి దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో గరిడీవీధిలో సింగిల్ నెంబర్ లాటరీ నిర్వహిస్తున్న నిర్వాహకులు నయనప్పగారి మనోహర్, వెంపల సుబ్రమణ్యం, సంగీతం, బాలాజీలను అదుపులోనికి పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. సింగిల్ నెంబర్ లాటరీ ముఠాలో ఇంక ఎవరెవరు ఉన్నారు అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అర్హులైన రైతుకి పరిహారం అందిస్తాం : సబ్ కలెక్టర్



చిల్లకూరు, మార్చి 6 ప్రభాతవార్త: అర్హులైన ప్రతి ఒక్క రైతుకి పరిహారం అందిస్తామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు మండలంలోని తమ్మిన పట్నం గ్రామపంచాయతీ పరిధిలో తీగపాలెం వద్ద ఏపీఐసీకి సంబంధించి కొన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు రైతుల వద్ద నుండి భూములు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా రెవిన్యూ రికార్డులో సాగులో ఉండినా ప్రతి ఒక్క రైతుకు పరిహారం అందించడం జరుగుతుందని మొదటి విడతగా మొదటి జాబితా రెడీ చేయడం జరిగిందని వాటిల్లో మీకు పొలం ఉండి లిస్టులో పేరు రాకపోయినా పొలం లేనివారికి లిస్టులో పేరు నమోదైన వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్క రైతుకి న్యాయం చేకూరేంతవరకు కృషి చేస్తామన్నారు. గతంలో జిల్లా కలెక్టర్ కూడా ఇక్కడ సమావేశం నిర్వహించి క్షుణ్ణంగా రైతుల సమస్యలు తెలుసుకుని ముందుకు వెళ్తున్నారు. సుమారుగా 500 ఎకరాలకు ప్రభుత్వ భూమికి పరిహారం అందించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, గ్రామ సర్పంచులు నెల్లిపూడి సుబ్రహ్మణ్యం,ఎంపీటీసీ కోటేశ్వరరావు, నాయకులు కోట సతీష్, సిఐ కిషోర్ బాబు, ఎస్ఐ సురేష్ బాబు, సిబ్బంది ఉన్నారు.

## సీఎం పురస్కారానికి తిమ్మానాయుడుపాలెం మహిళ ఎంపిక



కోట, మార్చి 6 ప్రభాతవార్త : మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. కుటుంబ పోషణలో భాగస్వాములు అవుతున్నారు. ఈ నేపథ్యంలో కోట మండలం తిమ్మానాయుడు పాలెం గ్రామానికి చెందిన కూరేసి లక్ష్మి అంచలం చెలుగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ సమాజంలో పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. లక్ష్మి ఎంతో కష్టపడి రూ.100 కూలీ కష్టం నుంచి వ్యాపారం ప్రారంభించి నేడు వేలాది రూపాయలు సంపాదిస్తోంది. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏలూరులో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు చేతులు మీదుగా లక్ష్మి రూ.5 లక్షల చెక్కును అందుకోనున్నట్లు వెలుగు ఎపిఎం అనిల చెప్పారు. శ్రమించే తత్వం ఉన్న మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందన్నారు.

## పంచాయతీ అభివృద్ధికి సహకరించండి



కోట, మార్చి 6 ప్రభాతవార్త : కోట మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రజలు తమ ఇళ్లకు సంబంధించి పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరిం చాలని గూడూరు డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ కోరారు. గురువారం కోట మండలం చెందోడు గ్రామంలో హౌస్ ట్యాక్స్ కలెక్షన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే ప్రజలు సహకరించాలని కోరారు. అందుకు ప్రతి ఒక్కరూ సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారు

**- వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి**



వెంకటగిరి, మార్చి 6 ప్రభాతవార్త : వైఎస్సార్సీపీ శ్రేణులే లక్ష్యంగా వారికి ఏ పనులు చేయొద్దంటూ సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించడం తగదని వెంకటగిరి వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి లోని నేదురుమల్లి నివాస గృహంలో కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల తర్వాత ఆంధ్ర రాష్ట్రంలోని ప్రజలందరికీ న్యాయం చేయాల్సిన స్థానంలో ఉండి నేరుగా, తెలియకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఏ పనులు చేయకుడదని అన్ని స్థాయిల్లోనూ ఇది వర్తిస్తుందని వ్యాఖ్యానించడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్న హయాంలో పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన అందరికీ ప్రభుత్వం న్యాయం చేసిందని గుర్తు చేశారు. 2027లో జెమిలి ఎన్నికలు రావడం తథ్యమని మళ్లీ వైఎస్ఆర్సిపికి ప్రజలు పట్టడం కట్టేందుకు ఇప్పటికే నిర్ణయం తీసేసుకున్నారని తెలియజేశారు. ఆర్టిఐ విభాగం అధ్యక్షుడు కౌన్సిలర్ ఆది శంకరయ్య, పార్టీ ఎస్టీ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున్‌లు నేదురు మల్లికి జ్ఞాపికలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, కార్తీక్‌రెడ్డి, కౌన్సిలర్లు వహీదా, సుబ్బారావు, శ్రీనివాసులు, నాయకులు నాగయ్య, బండి రమేష్‌రెడ్డి, సతీష్‌లు ఉన్నారు.

## నేదురుమల్లితో భేటీ అయిన భూమన



వెంకటగిరి, మార్చి 6 ప్రభాతవార్త : టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు కుమారుడు సుమంత్ శుభశ్రీల వివాహానికి విరువురు హాజరయ్యారు. వివాహ వేడుకల్లోనే ఇరువురు కలుసుకొని పలు అంశాలను చర్చించారు. జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనంజయ రెడ్డి, ఎంపీ గురుమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు లక్కమనేని కోటేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ తదితరులు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి ఎంపీడీవో సన్మానం



వాకాడు, మార్చి 6 ప్రభాతవార్త : వాకాడు మండలం అందలమాల గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి గురువారం పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుడు జహంగీర్ ను ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. వాకాడు షాదీ మంజీల్లో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నసీం అలి, ప్రధానో ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజయానికి గుర్తుగా ఆవిర్భావ విజయోత్సవ సభ



చిల్లకూరు, మార్చి 6 ప్రభాతవార్త : జనసేన జెండా ఆవిష్కరణ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి కష్ట సమయాల్లో పార్టీకి తోడు ఉంటూ పార్టీ అధికారంలోకి వచ్చే వరకు పవన్ కళ్యాణ్ వెన్నంటి నడచిన జనసైనికులంతా చిత్రాడ పిఠాపురంలో జరిగే ఆవిర్భావ సభకు తరలి రావాలని ఆ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్‌రావు కోరారు. చిల్లకూరు మండలం తమ్మినపత్నం గ్రామంలో నాయకులు శివాజీ, రవి, మహేష్ ఆధ్వర్యంలో గురువారం జనసేన జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు క్రాంతి, చిన్నా, కార్తీక్, సునీల్, సుధీర్, శ్రీనివాసులు, మధు, సాయి కిరణ్, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, నాగూర్, వేణు, రాజు, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

## సంఘాల్లో సాంకేతిక సవ్వడి

కోట, మార్చి 6 ప్రభాతవార్త : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) బలోపేతానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చేపట్టిన సంఘాల డిజిటలైజేషన్ జిల్లాలో శరవేగంగా సాగుతోంది. ఏప్రిల్ నుంచి పిఏసిఎస్‌లలో లావాదేవిలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో సుమారు 71 పిఏసిఎస్‌లు ఉన్నాయి. వాటి బలోపేతానికి కేంద్ర ప్రయోజిత పథకం కింద రాష్ట్రప్రభుత్వం 8 నెలల క్రితం డిజిటలైజేషన్ ప్రక్రియ మొదలు పెట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరం వివరాలన్నీ రాష్ట్ర సహకార శాఖ ఇచ్చిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నారు. మార్చి 31 నాటికి ఆడిట్ నివేదికలో బ్యాలెన్స్, ఓచర్లు ఎప్పటికప్పుడు పొందుపరుస్తున్నారు. అధికారులు సంఘాల వారీగా నిత్యం ప్రగతిపై సమీక్షించి సూచనలు చేస్తున్నారు. అడపాదడపా సాంకేతిక సమస్యలు తలెత్తుతుంటే వాటిని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు.

## మహాసదస్సు విజయవంతం చేయండి



గూడూరు, మార్చి 6 ప్రభాతవార్త : పట్టణంలోని పెద్దపోస్ట్ ఆఫీస్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం బీఎస్పీ నాయకులు నాశిన భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదిన విజయవాడలోని వెన్యూ ఫంక్షన్ హాల్ ఎన్టీఆర్ కాలనీ వద్ద మహానాడు రోడ్డు జంక్షన్ దగ్గర జరిగే బీఎస్పీ కార్యకర్తల మహాసదస్సు జరుగుతుందని బీఎస్పీ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కరపత్రాలు ఆవిష్కరించారు. నాసిన భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ నోట్ల రాజ్యాన్ని కూలుద్దాం ఓట్ల రాజ్యాన్ని సాధిద్దాం రాజ్యాంగం బద్ధంగా జరగాల్సిన ఎన్నికలు అందుకు విరుద్ధంగా అగ్రకుల పార్టీల నాయకులు ఆక్రమంగా సంపాదించిన నోట్లతో పేద ప్రజల ఓట్లను కొనుగోలు చేసి అధికారం లోకి వచ్చి అదే రాజ్యాంగానితుంగలో తొక్కుతున్నారన్నారని అన్నారు. నాసిన భాస్కర్ గౌడ్ బీఎస్పీ పార్టీ నాయకులు మీజూరు సుబ్రమణ్యం గూడూరు నియోజకవర్గం బీఎస్పీ పార్టీని ఇంచార్జి గుంట మడుగు వెంకటేశ్వర రాజు, గూడూరు పట్టణ అధ్యక్షులు ఎల్వీ సుబ్బయ్య, బీసీ సంస్వయ కమిటీ గూడూరు నియోజకవర్గ కన్వీనర్ లక్ష్మయ్య, వేమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహరికోటలో కిండర్ గార్టెన్ స్కూలు వార్షికోత్సవం



శ్రీహరికోట (తడ), మార్చి 6 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో శాస్త్రవేత్తలు, ఉద్యోగుల పిల్లలు చదువుకునే కిండర్ గార్టెన్ స్కూలు వార్షికోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కేజీ స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ, సిబ్బంది, పిల్లలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ఎంఆర్‌కె ఆడిటోరియంలో జరిగిన ఈ వార్షికోత్సవ కార్యక్రమాన్ని డైరెక్టర్ ఎ.రాజరాజన్ ప్రారంభించారు. అనంతరం కెజిఎస్ఎంసి చైర్మన్ పిఎ శరవణ పెరుమాళ్, షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ ఎ.రాజరాజన్ పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా యుకెజి చదివే పిల్లలకు మెడల్స్ మరియు మెరిట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కొంతమందికి క్యాష్ ప్రైజులు అందజేశారు. రిటైర్డ్ స్టాఫ్‌ను కూడా ఈ సందర్భంగా సత్కరించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## కష్టపడి చదవి ఉత్తమ ఫలితాలు సాధించండి

**- ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి**



రామచంద్రాపురం, మార్చి 6 ప్రభాతవార్త : కష్టపడి చదివి పది ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే సతీమణి సుధారెడ్డి అన్నారు. గురువారం సొరకాయలపాళ్యెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన సరస్వతి పూజకు ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకున్నారన్నారు. ఈ క్రమంలోనే ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు జయసుధ ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం, పీఈటీ పోస్టులు మంజూరు, పాఠశాలకు మంజూరు చేయించాలని కోరారు. దీని ఆమె సానుకూలంగా స్పందిం చారు. ఎంఈవో 2 జయవేలు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చినబాబు, కార్యదర్శి మధుసూధన్, కోశాధికారి మునిచంద్ర నాయుడు, రాయలచెరువు సర్పంచ్ మాధవి, టీడీపీ నాయకులు తిరుమలరెడ్డి, జనార్థన్ చౌదరి, సుబ్రమణ్యం యాదవ్, నరసింహారెడ్డి, మునిరామిరెడ్డి,రంజిత్,సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు కృషి : కడ పి.డి

**-చిరు వ్యాపార మహిళలకు రాయితీతో ఇ-సైకిళ్లు పంపిణీ**



కుప్పం, మార్చి 6 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గంలో ఉన్న మహిళల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం కుప్పం బస్టాండులో ఇఇఎస్ఎల్ సంస్థ(ఢిల్లీ) వారు రూపొందించిన 50 ఎలక్ట్రిక్ సైకిళ్లను గ్రామాల్లో చిరు వ్యాపారులు చేసుకునే డ్వాక్రా సంఘాల మహిళలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పిడి మాట్లాడుతూ కుప్పం అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు స్వర్ణకుప్పం 2029విజన్ అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారు స్వయం ఉపాధి పొందేలా చర్యలు చేపడుతున్నారన్నారు. సుమారు 40వేల విలువ చేసే ఇ-సైకిళ్లను రాయితీతో రూ.9450లకే స్త్రీ కార్యక్రమం కింద అందిస్తు న్నట్లు చెప్పారు. ఈ సైకిళ్లకు ఓసారి పూర్తిగా బ్యాటరీ చార్జ్ చేస్తే 25కి.మీల ప్రయాణం చేయవచ్చున్నారు. మహిళా వ్యాపార వేత్తలకు ఇది ఎంతో ఉపయోగమన్నారు. తొలి విడతగా 300మందికి ఇ-సైకిళ్ల పంపిణీ చేస్తామన్నారు. ముమ్మందు అందరికీ ఈ సైకిళ్ల అందేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు కుప్పంలో మహిళలను తారాస్థాయికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారన్నారు. ప్రతి ఇంట్లో ఓ పారిశ్రామికవేత్త తయారుకావాలనేది సిఎం చంద్రబాబు ఆలోచన అన్నారు. మహిళల అభివృద్ధితో కుటుంబాలు బాగుపడతాయన్నారు. మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడు తూ సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంల సూచనలతో కడ పి.డి. వికాస్ మర్మత్ కుప్పం పట్టణ రూపురేఖలు మార్చే బృహత్తర ప్రణాళికను రూపొందించారని అది జూలై నెలనుంచి అమలవుతుందని పేర్కొన్నారు. అనంతరం మహిళలకు ఇ-సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఇఇఎస్ఎల్ ప్రతినిధి కవారియా, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేతలు గోపీనాథ్, డాక్టర్ వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు బాబు, విశ్వనాథనాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్,వేలు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నేతలు కన్నన్, మంజు, జనసేన నరేష్, బిజెపి శివశ oకర్, మహిళా నేతలు అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్, సుగుణమ్మ, శారదమ్మ, తిరుమగళ్, వసంతమ్మ, వెలుగు, మెప్మా అధికారులు చంద్రశేఖర్, శ్రీనివాసమూర్తి, జగదీష్, మహిళలు పాల్గొన్నారు.

## తెప్పోత్సవాలకు పుష్కరిణి ముస్తాబు

**-9నుండి ఐదురోజులు ఉత్సవాలు**



తిరుమల,మార్చి 6ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక సాలకట్ల తెప్పోత్సవాలకు పవిత్రమైన పుష్కరిణి ముస్తాబైంది. ఇందుకోసం తమిళనాడునుండి వచ్చిన కార్మికులు తెప్ప ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. పుష్కరిణిలో ఐదురోజులు జరిగే ఈ తెప్పోత్సవాలకు టిటిడి అన్ని ఏర్పాట్లు చేసింది. 9నుండి 13వతేదీ వరకు ఐదురోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ తెప్పోత్సవాలు ప్రతిరోజూ రాత్రి 7గంటల నుండి 8గంటల వరకు ఆలయ పుష్కరిణిలో వేడుకగా నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో తొలిరోజు మార్చి 9వతేదీ ఆదివారం సాయంత్రం సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్ర

## అందరి సహకారంతోనే బ్రహ్మోత్సవాలు విజయవంతం

**వివిధ శాఖల సహకారం మరువరానిది: ఇఓ**
**సేవకుల భాగ్యం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు :చెంచయ్యనాయుడు**



శ్రీకాళహస్తి,మార్చి 6 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని పండగను అందరి సహకారంతో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేసారని ఈ సభలో వారిని సత్కరించటం శివయ్య ఇచ్చిన అవకాశం అని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి అన్నారు. గురువారం బ్రహ్మగుడి వద్ద సేవా కమిటి నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడు మాట్లాడుతూ తనకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఒక అవకాశం కల్పించారని ఇది శివయ్య ఇచ్చిన అవకాశంగా భావించా నన్నారు. అభివృద్ధి విషయంలో గతంలో ఏ పాలకమండలి నాయకుడు చేయని విధంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి చేపట్టారన్నారు. ముఖ్యంగా ఎంతో కాలంగా సన్నిధివీధిలో రోడ్డు ఇరుకుగా ఉంటూ ట్రాఫిక్ చిత్తడిలో ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. తాత్కాలిక శివరాత్రి అభివృద్ధియే కాకుండా శాశ్వత పనులకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు.అంతేకాక రాజగోపురం ఆధునీకరణ సుందరీకరణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు.

**తాను కొత్త అయినా అధికారుల సహకారం అద్భుతం:ఇఓ**

సభలో ఇఓ డి.బాపిరెడ్డి మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన రెండు నెలల్లోనే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వచ్చాయి. అయితే సిబ్బంది సహకారం మాటల్లో చెప్పలేనిదన్నారు.కాగా వివిధ శాఖల అధికారుల సహకారం వర్ణనాతీతం అన్నారు. ముఖ్యంగా ఉత్సవాల్లో మున్సిపల్, పోలీసు, అగ్నిమాపక శాఖ సహకారం ఎంత చెప్పినా తక్కువే అన్నారు. ఇక తన సిబ్బంది ఉత్సవాలను సకాలంలో తీసుకు రావటంలో అందించిన సహకారం, చొరవ ఎంత పొగిడినా తక్కువే అన్నారు.ఇక పారిశుద్ధ్య శాఖ సహకారంతో ఉత్సవాలు సాగిన వెంటనే పరిశుభ్రం చేయటం వారిలోని చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఉత్సవాల్లో ఏర్పాటుల్లో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, వారి సిబ్బంది పని తీరు సొంత ఇంటిలో పనుల్లా చేసారని అభినందించారు. శ్రీకాళహస్తి డివిజన్‌లోని డివైయస్‌పి నరసింహమూర్తి, సిఐలు గోపి, వెంకటేశ్వర్లు, తిమ్మయ్యల సేవలు అభినందనీయం అన్నారు. ఈ సభలో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు సేవకులు రంగినేని చెంచయ్య నాయుడు, డి.లక్ష్మమ్మ, ఎం.రవి, టి.విజయకుమార్, గోపినాథ్, వి.గుర్రప్పశెట్టి, మునిరాజా యాదవ్, జ్యోతి,నెమళ్ళూరు సుబ్రమణ్యం, జి.కృష్ణవేని, పోలూరు ప్రమీల,ఎన్ సూరి నాయుడు, ఎం.సరస్వతి, కంఠా రమేష్, బి.మునిలక్ష్మీ,ఎం. సుబ్రమణ్యంరెడ్డి, కొట్టె సాయి, అనిత, సుమతి తదితరులు పాల్గొన్నారు. వారికి ఇఓ డి.బాపిరెడ్డి సత్కరించారు. సభ వ్యాఖ్యాతగా విజయసారధి వ్యవహరించారు.

## భక్తి శ్రద్దలతో చక్రస్నానం...ధ్వజావరోహణం



శ్రీకాళహస్తి రూరల్,మార్చి 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన టిటిడి ఆలయానికి సంబంధించిన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్స వాల్లో గురువారంవారం ఉదయం చక్రస్నానం ను భక్తజన సమూహంతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. ఆలయంలో చక్కగా అలంకరించి చక్రస్నానాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో చక్రస్నానం ఏర్పాటు చేసారు. చక్రస్నానం తరువాత నీటిని చుట్టుపక్కల గ్రామస్తులు చల్లుకున్నారు. తరువాత ధ్వజావరోహణం కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ధ్వజారోహణం తరువాత అధిరోహింపజేసిన మింటిని దించారు. ఈ కార్యక్రమాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా తొండమాన్‌పురానికి చెందిన భక్తులు హాజరయ్యారు. ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలంటే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సంబరాలే. తిరుమల వెళ్ళలేని భక్తులు ఇటీవల కాలంలో తొండమాన్‌పురానికి వెళుతున్నారు. ఇక్కడ స్వామి ప్రసన్న వదనుడుగా దర్శనమిస్తున్నారు. అయితే ఈ ఆలయం జాతీయ రహదారి పక్కనే ఉన్నా ఎందుకో టిటిడి ప్రచారంలో వెనుకబడ్డారు. బుధవారం స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవాల్లో అశ్వవాహనంలో దర్శనమిచ్చారు. ఉత్సవం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా అలంకారం జరిపి గ్రామోత్సవానికి సిద్దం చేసి వాహనంలో ప్రతిష్టించారు. మేళ తాళాలు మంగళవాయిద్యాలు వేద పండితుల వేదమంత్రాలతో గ్రామోత్సవం సాగింది. ఉత్సవంతో పాటు అర్చకులు రమణాచార్యులు,బాబు,కృష్ణ,జయకుమార్, గోపి, మాధవా చార్యులు తదితరులు పాల్గొన్నారు. సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్‌రెడ్డి, కందాటి శేఖర్‌రెడ్డి సర్పంచ్ బుర్రెహేమభూషణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి..ఆర్డీవో

**ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం**



తొట్టంబేడు, మార్చి 6 ప్రభాతవార్త: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని నేడు మహిళలకు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీవో భాను ప్రకాష్ అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళ దినోత్సవంను కార్యక్రమాన్ని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డిఎల్‌డివో సుస్మిత తొట్టంబేడు తహశీల్దార్ మధుసూధన్, టుటౌన్ సిఐ వెంకటేశులు, ప్రగతి కోఆర్డినేటర్ ప్రభాకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మరియు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీ యొక్క జీవితంలో పుట్టుక, విద్య వివాహం ఆర్థిక స్వాలంభన ఈ నాలుగు అంశాలుపరిపూర్ణత కలిగి ఉండాలని అప్పుడే స్త్రీకి నిజమైన స్వేచ్ఛ సమానత్వం కలిగినటువంటిస్వేచ్ఛ సమానత్వం ఉండాలని తెలిపారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. డిఎల్‌డిఓ సుస్మిత మాట్లాడుతూ స్త్రీ జీవితంలో భావోద్వేగాలతో కూడుకున్నదని స్త్రీ మానసికంగా పురుషులకన్నా ధృడంగా ఉండాలని నిర్ణయాలను తీసుకునే సమయంలో దృడంగా ఉంటారన్నారు. అనంతరం మహిళలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సిడిపిఓ శాంతిదుర్గ మాట్లాడుతూ మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళ దినోత్సవం కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని ఈ కార్యక్రమంలో మహిళలు సాధించిన విజయాలు మరియు వారు భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలు అందుకు సమాజం వారికి కల్పించాల్సిన వనరులను ఇతర విషయాల గురించి తెలిపారు.